## బాలల సంక్షేమానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోన్న భారతావనిలో దిక్కులేని ఓ బాలుడి స్థితి?

**హిమజా రమణ**

**కథ**

# బాలభారతం

ఉరకలు వేస్తూ ప్రవహిస్తున్నది కృష్ణే.

పడవ కొరకు ఎదురు చూస్తూ ఇద్దరు. ఒకడు ముసలోడు కిష్టయ్య. రెండోవాడు చిన్న కుర్రాడు కృష్ణమూర్తి.

నది ఒడ్డున కూర్చుని వున్నారు. కృష్ణమూర్తి కునుకు తీస్తున్నాడు. నది ఒడ్డున రెండు చెత్త కుప్పల్లా వున్నారు.

సూర్యరశ్మికి కమిలి దుమ్ముకొట్టుకొని అలసిపోయిన వారి ముఖాలు, మకిలి బట్టి చిరిగిన బట్టలు ఒకే రంగు బురద రంగులో వున్నాయి. ఇసుకపై అడ్డంగా ముసలోడు కిష్టయ్య తాలూకు ఎముకల గూడు కాళ్ళు చాచి పడుకుని వుంది. ఎండిపోయిన కొమ్మ నుండి మెలిపెట్టి లాగి చిదిమి వేయగా వాడిపోయిన పూల గుత్తిలా వున్నాడు కిష్టయ్య. ప్రక్కన పది సంవత్సరాల కృష్ణమూర్తి ఎక్కడినుండో నదిలో కొట్టుకు వచ్చి అలలచే విసరివేయబడిన ఎండు కొమ్మలా వున్నాడు కిష్టయ్య.

మోచేతిపై కొద్దిగా లేచి ఆవలి ఒడ్డుకేసి చూశాడు. ఎండి చెల్లా చెదురుగా పలుచగా విసరి వేయబడినట్లున్న రెల్లు పొదలనుండి నిక్కి చూస్తున్నట్లుగా పడవ కన్పించింది. ఆవలి ఒడ్డు నుండి ఎక్కడికో పోతున్న డొంక దారి.

పీక్కుపోయిన కళ్ళు వాసిన కనురెప్పలు అలసట బాధతో ముడుతలుదేరిన ముఖం. పొడి దగ్గు దగ్గుతూ చేతితో నోరు మూసుకుంటూ కృష్ణమూర్తి వేపు చూశాడు కిష్టయ్య. మెలికలు తిప్పుతూ కిష్టయ్యను పడుకోకుండా చేస్తున్న దగ్గు. ఎక్కడో



కూరుకుపోయిన కళ్ళ నుండి కారుతున్న కన్నీరు.

కిష్టయ్య దగ్గు, ఒడ్డున వున్న ఇసుకతో గుసగుసలు పోతున్న అలల సవ్వడి తప్ప ఆ మైదానంలో మరేమీ శబ్దం వినిపించడం లేదు. నదికిరువైపులా పరచుకొని పండిపోయి కోతకు సిద్ధంగా వున్న వరి చేలు, డొంక దారి తప్ప కిష్టయ్య కంటికి మరేమీ

కనిపించలేదు. పండిన వరిపైరు గాలికి అలలు, అలలుగా లేస్తుండగా ఎండలో కనులు మిరుమిట్లు గొలిపే ఆకాశం. కిష్టయ్య చిన్నగా నవ్వుకున్నాడు.

తన చేతులు కాళ్ళలోని శక్తిని ఇంతకు ముందే లాగేసుకున్న పొలాలు, ఎండ తన చూపును కూడా లాగేస్తున్నాయి అనుకున్నాడు.

ఇంతకుముందు కొన్ని నెలలు నుండి అలాగే వున్నా కిష్టయ్య పరిస్థితి ఈ రోజు మరీ అధ్వాన్నంగా వుంది. తాను చావుకు చాలా దగ్గర్లో వున్నట్లు అనిపిస్తోంది. చావును గురించి అంతగా బాధపడటంలేదు. అదెలాగూ తప్పదు కాబట్టి. తన ఇష్ట ప్రకారం జరిగేటట్లయితే తన ఊళ్ళో చావాలని వుంది. అంతకంటే ముఖ్యంగా కిష్టయ్య బాధపడేది తన మనుమడ్ని గురించి. తను ఛస్తే వాడి పరిస్థితేమిటి?

ఈ ప్రశ్న ఇంతకుముందు కిష్టయ్యను చాలాసార్లు వేధించింది.

ఏదో విధంగా తనకు తాను సర్ది చెప్పుకునే వాడు.

కాని... ఈ రోజు...? ఏదో విధంగా ఊరు చేరదామనుకున్నాడు. కానీ ఊరు చాలా దూరం. తనెలాగూ చేరలేడు. దారిలోనే చావు తప్పదు. ఇక్కడిజనం కొంతవరకూ ఫర్వాలేదు. ఛీ! పో! అనకుండా ఏదో భిక్షమేస్తుంటారు. బిచ్చగాళ్ళను నీచంగా చూస్తారుకానీ ఏదోకాస్త పడేస్తుంటారు.

ఆలోచనలతో మనవడి తల నిమురుతున్నాడు.

కృష్ణమూర్తి కళ్ళు తెరచి చూశాడు. పెద్ద కళ్ళు, కొనదేరిన ముక్కు. చిన్న ముఖం. పాలిపోయిన పెదిమలు, ఆ ముఖంలో పసిపిల్లలలో వుండే ఉత్సాహం లేదు.

''వస్తుందా తాతా?'' కళ్ళు తుడుచుకుంటూ అడిగాడు.

''లేదు. రావడంలేదు. అక్కడే వుంది.'

''అటు నుండి ఇటు రావలసిన అవసరం ఎవరికీ లేనట్లుంది'' చెప్పి తల నిమురుతూ తనే మళ్ళీ అడిగాడు.

''నిద్ర పట్టిందా?''

అవునో! కాదో? అర్థంకాని విధంగా తలూపాడు మనుమడు.

ఇద్దరూ చాలాసేపు మౌనంగా కూర్చున్నారు.

కృష్ణమూర్తి మట్టి పెడ్డను రాయితో పగులగొడుతూ ''చూడు తాతా! ఇంతలావు మట్టిపెడ్డ పగిలి చిన్నదై, చాలా చిన్నదై, నువు చూడలేనంత చిన్నదై పోయింది''

''ఏంటిరా అయితే?''

''ఏమీ లేదు'' అని కాస్సేపాగి మళ్ళీ.

''మనం ఎన్నో పట్నాలూ, పల్లెలూ తిరిగాం. ఎక్కడికిపోయినా ఒక విధంగానే వుంది. మనం ఎవరికీ కాకుండా పోయాం... '' అన్నాడు ఏదో ఆలోచిస్తున్న వాడిలా కృష్ణమూర్తి.

కొంతసేపు మౌనంగా వుండి తరువాత మనువడి వేపు జరిగి ''నిజంరా కృష్ణమూర్తి నీవనేది నిజం. అంతా మట్టే— పల్లెలూ పట్నాలూ— వాటిలోని ప్రజలు... నీవూ — నేనూ... అంతా మట్టిలోంచే వచ్చాం...

నీకు చదువొస్తే ఎంత బాగుండేది? చాలా పైకి పోయేవాడివి. మన తల రాతలిలా గుంటే మనకి చదువు కూడనా?'' అంటూ కృష్ణమూర్తిని దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు కిష్టయ్య.

''వుండహే... '' అంటూ ముసలోడి వణుకుతున్న వ్రేళ్ళ నుండి తన అట్టగట్టిన వెంట్రుకలను లాక్కుంటూ.

''ఏంటి నువ్వనేది? పట్నాల్లో, పల్లెల్లో వుండేదంతా మట్టేనా?'' అనడిగాడు.

''అవున్నా.... అన్నీ భూమిలోంచే వచ్చాయి. భూమి ఏంటి? మట్టే. మట్టిలోంచి పుట్టిందంతా మట్టిలో కలవాల్సిందే.. అది సహజం. అందుకే... మనిషి బ్రతికినన్నాళ్ళూ వినయంగా బతకాల. నేను చావుకు దగ్గరలో వున్నా...'' అని మళ్ళీ తనే ''నేను పోయాక నీ గతేందిరా? ఎక్కడికి పోతావు?'

ఈ ప్రశ్న ఇప్పటికి చాలా సార్లు అడిగిందే. కిష్టయ్య చావు కబుర్లు విసుగ్గా వున్నాయి కృష్ణమూర్తికి. అందుకే జవాబు చెప్పకుండా అవతలికి తిరిగి గడ్డిపోచను నెమ్మదిగా కొరుకుతూ కూర్చున్నాడు.

''నేనడిగేది విన్నేరా... జవాబు చెప్పవేందిరా? నేను చచ్చిన తర్వాత ఏం చేస్తావని అడుగుతున్నా!''

కుర్రాడి వేపు చూస్తూ దగ్గుతూనే అడిగాడు కిష్టయ్య.

''నేనెప్పుడో చెప్పినా...'' ఎటో చూస్తూ అన్నాడు.

కృష్ణమూర్తికి ఈ సంభాషణ ఇష్టంలేక పోవడానికి కారణం ఇలాంటి మాటలు వచ్చిన ప్రతిసారీ వారు వివాదపడుతుంటారు.

మొదట్లో ఇలాంటి మాటలు శ్రద్ధగా ఆలకించేవాడు. తాతపోతే తన సంగతేమిటని భయపడి ఏడ్చేవాడు. కానీ రాను, రానూ ఇలాంటి కబుర్లు వినీ వినీ విసుగేసింది. అందుకే ఈ సారి తాత ప్రశ్నకు జవాబు చెప్పకుండా తన ఆలోచనలో తానున్నాడు.



## మార్గం

అంద వికారియైన స్త్రీ ప్లాస్టిక్ సర్జన్ దగ్గరికి వచ్చి అడిగింది.

''నా మొహం అందంగా తయారు చేయడానికి ఎంత తీసుకుంటారు?''

''మూడు వేల అయిదొందలు''

''అంత నేనివ్వలేను. చవుకలో ఏదైనా ఉపాయం వుంటే చెప్పండి.''

''ముసుగు వేసుకోవడం మొదలుపెట్టండి'' టక్కున అన్నాడు డాక్టర్.

—పచ్చా రఘు (దూది వెంకటాపురం)

"ఏంటిరా? ఏమీ చెప్పవు? నీ బ్రతుకు నీవు బతగ్గలిగే స్థితిలో లేవాయె. నీ వయసు పన్నెండేళ్ళు. ఒంటి ఊపిరోడివి. కష్టపడి పని చేయలేవు. ఎక్కడికిపోతావు? పెట్టేవాళ్ళెవరో తెలుసుకుని బిచ్చమడుక్కోగలవా? ఎవరినో బిచ్చమడుగుతూ బతకడం నాకూ బాధే. కొంతమంది తిడతారు. మరికొంత మందికి ముక్కు మీదే వుంటుంది కోపం. మెడబట్టుకుని గెంటేసేవాళ్ళు కూడా వుంటారు. బిచ్చగాడి నెవరయినా మనిషిలా చూస్తారటరా పెపెంచకంలో. ఎవరూ... ఎవ్వరూ... చూడరు నేను బజారున పడి పదేళ్ళయింది. నాకు తెలుసు మనకేసే పది, ఐదు పైసలో, పిడికెడు మెతుకులో వేయి రూపాయిల్లా కనిపిస్తాయి వేసేవాడికి నాయాల్ది. పిడికెడు మెతుకులు వేస్తూ స్వర్గలోకం తలుపులు తమ కొరకే తెరుస్తున్నట్లు ఊహించుకుంటారు. అంతకు తప్ప వాళ్ళు ధర్మం చేయడానికి వేరే కారణం ఏమైనా వుంటుందంటావా? పైసలయినా, పిడికెడు మెతుకులైనా, రొట్టెముక్కయినా, చద్ది కూరయినా ఏదైనా సరే పెడుతున్నారంటే కారణం జనంలో కొద్దో గొప్పో పాపభీతి వుండటం వల్లనేరా! అంతేగానీ అయ్యో పాపం అనుకునేవారు చాలా తక్కువ. ఒక ముద్ద మనకు పడేస్తే వాళ్ళు తినే ముద్దలు గొంతుకు అతుక్కుపోకుండా దిష్టిముద్ద మన ముఖాన వేసే మహాతల్లులు కూడా వుంటార్రా.

కడుపునిండిన మనిషి కూడా జంతువులాంటాడే. ఆకలితో వున్న వాడిపై సానుభూతి ఎవరికీ లేకుండా పోతున్నది. కడుపునిండిన వాడూ, ఆకలి గొన్నవాడూ ఇద్దరూ చెప్పాలంటే శత్రువులన్నమాట. ఒకరికి మరొకరు కంట్లో నలుసుగా కన్పిస్తారు"

జీవితంలో తగిలిన ఎదురుదెబ్బలు మనసులో మెదలడం వలన కిష్టయ్య కొంచెం ఆవేశపడిపోయాడు. పెదవులు వణికాయి. కనురెప్పలు టకటకకొట్టుకున్నాయి. కూరుకుపోయిన కళ్ళ నుండి వెచ్చని సముద్రం నీళ్ళు లాంటి ఉప్పని కన్నీళ్ళు రాలాయి. నల్లని ముఖం దుఃఖ భారంతో మరింతగా ముడుతలు పడి వికారంగా వుంది.

తాతను చూస్తూంటే భయమూ, బాధా కలుగుతున్నాయి కృష్ణమూర్తికి.

"అందుకేరా నీవెలా బతుకుతావని అడుగుతున్నాను. నీవా లోకం తెలీని పోరగాడివి. ఈ లోకమా పెద్దపులి. అది ఒక గుక్కలో నిన్ను మింగేస్తుంది. అది జరగకూడదనేరా నా బాధ.

నిన్నెట్లా పెంచానో నీకూ తెలుసు. మనకెవరున్నార్రా అయ్యా. నీకు నేను. నాకు నీవూ తప్ప... నెనెలా ఛస్తానురా నిన్ను వదిలిపెట్టి. నేను చావనురా. నిన్ను ఎవరిదగ్గర వదిలి పెట్టి చావాలిరా? ఒరే దేముడా! నీకేం ద్రోహం చేశాన్రా? బతకడానికి శక్తి లేదు. పిల్లాడిని రక్షించుకోవాలి. కాబట్టి చావనూకూడదు. ఇప్పటికి పదేళ్ళు. పదేళ్ళనుంచీ ఈ చేతులతో పెంచాను. నా చావు కొచ్చిందిరా దేముడా! నువ్వు కరుణామయుడివంటారే! కడుపు నిండినోళ్ళు భజన్లు చేసి భారీగా నీకు ముడుపులు కూడా ఇస్తారే. వాళ్ళకు మాత్రం ఏ బాధలూ, భయాలూ లేకుండా చూస్తావు..."

కిష్టయ్య మోకాళ్ళసందున తలదూర్చుకొని భోరున ఏడుస్తున్నాడు. నది వేగంగా ప్రవహిస్తూంది. కిష్టయ్య ఏడుపు గోల వినిపించనీయకుండా వేగంగా అలలు ఒడ్డును తాకుతున్నాయి.

మబ్బులు లేని ఆకాశం మండు టెండను చెరుగుతూ, ఉరకలు వేస్తున్న నదీ కెరటాలు చేసే సవ్వడి వింటూ, కాంతివంతమైన చిరునవ్వులు చిందిస్తోంది.

"ఏడవబాకు తాతా! ఏడవబాకు. ఇప్పటిదాకా ఎలాగో ఈదుకువచ్చావ్. నీకేం ఫర్వాలేదు. తర్వాత తర్వాతనైనా నేనేదో హోటళ్ళలో, ఎక్కడో పని చేసుకుని పొట్ట పోసుకుంటా..."

"పడవ వస్తోంది రాండిరో... రాండి...' ఎవడో పెద్దగా కేకలు వేశాడు.

ఆ కేకలకు ఉలిక్కిపడి జోలెలందుకొని లేచారు కిష్టయ్య, కృష్ణమూర్తి.

అప్పుడే నది ఒడ్డుకు వచ్చింది ఎద్దులబండి. బండిలోంచి భారీకాయుడైన ఆసామి దిగాడు. ఆయన కళ్ళల్లో ఎర్రజీరలు నిప్పు కణికల్లా వున్నాయి.

దూరం నుండి నెమ్మదిగా వస్తున్న పడవకేసి చూస్తూనే "కరువు ప్రాంతం నుంచేనా?" అనడిగాడా ఆసామి.

"అవునయ్యగోరూ..." వినయంగా చెప్పాడు కిష్టయ్య.

"అక్కడ తినడానికేం దొరకడంలేదా?'


ఎద్దులను నీళ్ళు తాగడానికి నాట్లు ఇప్పుతూ అడిగాడు ఆసామి.

"మనుషులే కాదయ్యా! ప్రాణమున్నదేదీ బతికేట్టులేదయ్యా"

"అక్కడోళ్ళు తిండికి తిమ్మరాజులూ, పనికి పోతురాజుల్లా వున్నారు. కష్టపడి పని చేస్తుంటే కరువెందుకొస్తుంది?"

"పొలాల్లో సారమంతా హరించుకుపోయింది. చవిటి పర్రలు అయిపోయాయి."

"పొలాలా! పొలాలెప్పుడూ మంచివే. దేవుడు అంతా మంచే ఇచ్చాడు. పొలాలు కాదు చేతులు. కష్టపడే చేతులుంటే రాళ్ళ



ల్లో రతనాలు పండించవచ్చు''

అంతలో పడవ వచ్చింది.

పడవను ఒడ్డుకు లాగి లంగరేశారు సరంగులిద్దరూ.

''ఎండ మండిపోతున్నాది. చల్లటి కల్లు.. కల్లు గావాల...'' పడవ నడిపే వాళ్ళల్లో ఒకడు చెబుతున్నాడు.

''నదిలోంచి రావడంతోనే కల్లు తాగాల ంటరా...'' అంటు చెణుకు విసిరి, ఎద్దులను బండికి కట్టుకుని వచ్చిన దారినే వెళ్ళిపోయా డు ఆసామి.

కిష్టయ్య, కృష్ణమూర్తి గభాలున పడవ ఎక్కి కూర్చున్నారు. కల్లు తాగి రావడానికి దూరంగా కనిపిస్తున్న తాటి తోపుకు వెళ్ళా రు పడవ నడిపే వాళ్ళు.

* * *

కల్లు కడుపు నిండా తాగినాక పడవ దగ్గరకు వచ్చారు సరంగులు. పడవ నెమ్మది గా కదిలింది. పడవను తాకే నది అలలు, తెడ్ల చప్పుడు జోల పాడినట్లుంటే పన్నెండే ళ్ళ కృష్ణమూర్తికి కమ్మని నిద్ర పట్టేసింది. ఎవరో పట్టి కుదిలించినట్లనిపించే సరికి ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూశాడు కృష్ణమూ ర్తి.

సరంగులు లంగరు వేస్తూ నవ్వుతున్నా రు.

''నిద్ర పట్టిందిరా అయ్యా!'' అడిగాడు కిష్టయ్య.

సరంగులకు పైసలిచ్చి బయలుదేరారు.

ఊరు రాగానే—

''ఏరా విడివిడిగానా? కలిశా?'' కిష్టయ్య అడిగి మళ్ళీ తనే మనవడి జవాబు ధాకముం దే

''కలిసే నయం. నీకు బిచ్చమడగడం కూడా చేతకాదాయె?'' అంటూ ఒక నిర్ణయానికి వచ్చాడు.

''నీ ఇష్టం''

''నీ గురించేరా నా బాధ. పని చేత కాదయె. బిచ్చమా! అడగవు. ఎలారా బతికేది? ఎవ్వరైనా డాబు కనపడగానే ధర్మం సేయమని ఎంటబడాలా! చచ్చీ చెడీ నేను ఎంత కూడబెట్టానో తెలుసా?''

ఆప్యాయంగా మనుమడి తల దువ్వుతూ అడిగాడు.

''ఎంత...'' ఎటో చూస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

''ఎనభై రూపాయలు''

ఏం నిర్ణయించుకున్నాడో ఏమో కృష్ణ మూర్తి.

''విడివిడిగానే పోదాంలే'' అన్నాడు.

''అలాగే''

''సరే! అదుగో అటు గుడి కనపడుతోం ది. నువ్వా గుడివేపు వెళ్ళు'' అన్నాడు.

కృష్ణమూర్తి ఎడమ వేపు గొందిలోకి. కిష్టయ్య ఎదురుగా పెద్ద ఎత్తులో కనిపిస్తున్న గుడి వేపుకే వెళ్ళిపోయారు.

* * *

చిమ్మ చీకటి ఎక్కడో దూరాన ఆటలా డుకుంటున్న వెలుతురు నిశ్శబ్దం మైదానం. అంత వరకూమైదానాన్ని తనలో దాచుకున్న చీకటి క్షణకాలం తొలగించిన మెరుపుల కాంతులు...

ఆ వెంటనే భూమ్యాకాశాలను దద్దరిల్ల జేసిన పిడుగుపాటు...

కృష్ణమూర్తి లేచాడు. కిష్టయ్య తాను ఆనుకుని కూర్చున్న చెట్టు మొదలుకు అతుక్కొని పోయినట్లు చలనరహితంగ వున్నాడు

''తాతా... ఊళ్ళోకి పోదాం పదా...''

సణిగాడు కృష్ణమూర్తి మరలా పిడుగు పడుతుందేమోననే భయంతో. ఆకాశంమెరిసింది. ఉరిమింది వేలకొలదీ, లక్షలకొలదీ చినుకులు టప, టప మంటూ ఆ ప్రాంతంలో రాలాయి.

''నేనింక బ్రతకలేనురా... ఈ దగ్గు దెయ్యంనన్నీ రాత్రి చంపేసేట్లుంది. అరేయ్ కృష్ణమూర్తీ... ఈ ఊరు వదిలి ఏదేని పట్నం ఎల్లిపో... అక్కడయితే ఏదేని పని దొరుకుతుంది. నీ చిన్న పొట్ట నిండుతుంది...''

దగ్గుతూనే చెబుతున్నాడు కిష్టయ్య.

''ఇప్పుడవన్నీ ఎందుకు తాతా... ముందు ఊళ్ళోకి పోదాం పద వర్షం పెద్దవుతోంది...'' గాభరాగా అన్నాడు కృష్ణమూర్తి.


ఎక్కడో పెద్దగా శబ్దం చేస్తూ పిడుగుపడింది. కిష్టయ్య మాత్రం లేవలేదు. కృష్ణమూర్తిలో గాభరా మరింత ఎక్కువైంది. తాతను పట్టుకు కుదిపాడు. కట్టెలా బిగుసుకుపోయి వున్నాడు తాత... మరోసారి పిలిచాడు, కుదిపాడు...

తాత... ఉలకలేదు, పలకలేదు... అయిపోయింది. అనుకున్నంతా అయిపోయింది. కిష్టయ్య ప్రాణాలు అనంతవాయువుల్లో కల్సిపోయి కొద్ది నిమిషాలే అయింది.

'చచ్చిపోవటం అంటే ఇది!' అన్నట్లు చేసి చూపించిన తాత శవాన్ని చూసి కొంచెంగా తన చిన్న బుర్రకు అర్థమయాక ''తాతా....'' అంటూ కృష్ణమూర్తి పెట్టిన కేక మరో పిడుగులా ధ్వనించిందా ప్రాంతమంతా.

* * *

తాతపోయాక కృష్ణమూర్తి ఆ ఊరు



## వాటర్ ప్రూఫ్

'యోర్నల్ డెపవియం' అనే ఇటలీ డైలీ పేపర్‌ను వానలో తడుస్తూ కూడా చదువుకోవచ్చు. అలా వీలున్న దినపత్రిక ప్రపంచంలో ఇదొక్కటే. ఈ పేపరు ప్లాస్టిక్‌తో తయారు చేయడం వలన ఇలా చదువుకునే వీలుంది.

డా. ఫణి (గోరంట్ల)

విడిచి దూరంగా వున్న సిటీకి చేరాడు. రెండు రోజులపాటు తాత దాచిన ఎనభై రూపాయలు పెట్టి ఖుషీ చేశాడు. సినిమాలు చూశాడు.. ఊరంతా హేపీగా తిని తిరిగాడు

ఆ తర్వాత 'ఉడిపి శ్రీకృష్ణ కేఫ్'లో క్లీనింగ్ బోయ్‌ఘా కుదిరాడు. 'సయ్‌దు.. సయ్‌డండీ' అంటూ కృష్ణమూర్తి బిజీ ఐపోయాడు. ఫ్రీడం ఫండమెంటల్ రైట్స్ మన గర్వకారణం! వెట్టి చాకిరీ చట్టబద్ధపు నేరం!

అవేవీ తెలియని కృష్ణమూర్తి చేస్తోన్నదదే. తెల్లారకముందు మొదలయితే అర్ధరాత్రికి ముందు ముగుస్తుంది అతని పని. ఆ పదహారు గంటల శ్రామికుడు భావి భారత నందనోద్యానంలోని డేఫోడిల్!

* * *

'ఠంగ్.. ఠంగ్... ఠంగ్... ఠంగ్...!

బిల బిల లాడుతూ పిల్లలంతా ప్లే గ్రౌండ్‌లో చేరారు. ఓ క్రమ పద్ధతిలో వరుసగా నించున్నారు. టీచర్స్ వచ్చారు. ప్రార్ధన మొదలయింది. ప్రార్థన పూర్తయింది.

డిస్‌బర్స్...! ముత్యాలబారుల్లా ఎవరి క్లాసులకు వాళ్ళు వెడుతున్నారు. నేపథ్యంలో మార్చింగ్ మ్యూజిక్ వినిపిస్తోంది. అంతా వెళ్ళిపోయారు. నేవీ బ్లూ.. సన్‌షైన్ వైట్ యూనిఫాం ఓచేతిలో స్కూలు బాక్సు మరో చేతిలో టిఫిన్ బాక్సు. ప్రార్థన... మ్యూజిక్ ఇంకా ఆ దృశ్యం కనబడుతూనే వుంది సినిమాలా కదల్లేదు కృష్ణమూర్తి.

వాడి పిడికెడు గుండె ఎందుకో స్పందిస్తోంది ఉద్వేగంగా. ఆ చిరుమేధ ఆలోచిస్తోంది ఉల్లాసంగా, అదెంతసేపో కాదు. జబ్బమీద ఛెళ్ళున దెబ్బ పడేవరకే. మళ్ళీ జిడ్డూ మురికీ వాక్యా.... చేతిలో తుడిచే గుడ్డా మరో చేత్తోఎంగిలి బకెట్.

'సయ్‌డ్.. సయుడండీ' నేపథ్యంలో గాణగాణ గ్లాసుల చప్పుడు. చేసీ అలసీ చచ్చి చెడీ పన్నెండుకు ఊపిరి తీస్తే రెండిడ్లీతో సగం చచ్చిన ప్రాణానికి సంకటిలాంటి ఓ ముద్దతో కాస్త పేద తీరుతుంది.

ఆ సమయం కృష్ణమూర్తికి ఎంతో ఇష్టం!

ఆ సమయంలోనే వాడు గిన్నెలు తోమే సబ్బుతో స్నానం చేస్తాడు. చింపిరి తలకు చిక్కులు తీసుకుంటాడు. బిరుసు కట్టి బెరడులా వుండే ఖాకీ నిక్కరు, వదులు బనియనూ వేసుకుంటాడు. ఆ సరికే నిద్రవస్తుంది. కానీ బలవంతంగా ఆపుకుంటాడు.

పన్నెండు గంటల టయానికి ఆ హోటల్ కు అవతలి రోడ్డులో వున్న పెద్ద భవనాల వైపు పరుగు తీస్తాడు.

ఠంగ్... ఠంగ్!

గేటు తీస్తారు. కెవడీ కాన్వెంట్ పిల్లల కోసం కారియర్లు లోనికి వస్తాయి. నర్సరీ పిల్లల కోసం ఆయాలూ ఇంకా అమ్మలూ వస్తారు. కాంపౌండ్‌లోని విశాలమైన మైదానంలో చెట్ల క్రింద కూర్చుని పిల్లలు అమ్మల్తో ఊసులు చెప్పీ చెప్పించుకునీ బువ్వలు తింటారు. రకరకాల బువ్వలు! కూరలు.. స్వీట్స్... అన్నీ ఎన్నో ఎన్నెన్నో అన్నీ చూసి ఆనందిస్తూ ఓ చెట్టు నీడన కూర్చుంటాడు

మగత వస్తుంది. మగతలో సుందర దృశ్యాలు నిలుస్తాయి. అలా ఎంతసేపనీ... గేట్ వేయబడుతుంది.

దృశ్యం చెదిరిపోతుంది.

'నేనూ ఆ కానిమేట్లు సదూకుంటాను.

ఓసారి హోటల్ ఓనర్‌తో అన్నాడు ఆశగా.

''వోర్నీ ఎదవనాయాలా ఇదా నీ యవ్వారం మళ్ళీ అక్కడికి పోయావంటే గెంటేస్తా జాగర్త.'' కళ్ళురిమాడు ప్రొప్రయిటరు.

కృష్ణమూర్తి మళ్ళీ ఆ మాటనలేదు కానీ అక్కడికి పోవడం మాత్రం మానలేదు.

* * *

ఆ రోజు ఎర్రగా బొద్దుగా వున్న అబ్బాయి ఏడుస్తున్నాడు. ముందర బుల్లి కారియరుంది. అమ్మ ఎందుకో రాలేదులా వుంది. ఆ నర్సరీ బాబును చూసాడు కృష్ణమూర్తి. దగ్గరకెళ్ళాడు.

''అన్నం'' అన్నాడు బాబు.

''మీ అమ్మ రాలేదా?'.

''రాలేదు. బుంగమూతి అటూ ఇటూ చూశాడు. కృష్ణమూర్తి కారియర్ విప్పాడు. పప్పు అన్నం, పెరుగూ వగైరా... మెల్లగా పప్పు కలిపిన అన్నం ముద్ద పెట్టాడు. పప్పయిపోయింది. పెరుగుతో అన్నం...

నర్సరీబాబుకు ధర్మసందేహం వచ్చింది.


''మీ అమ్మేదీ?''

గతుక్కుమన్నాడు కృష్ణమూర్తి. తాత గుర్తుకు వచ్చాడు. అమ్మెలా వుంటుందో తెలీదు.

''ఇది తిను.. చెబుతా'' పెరుగు అన్నం అందించబోయాడు.

''ఊహు.. చెప్పూ...?''

కృష్ణమూర్తి బాబును సూటిగా చూశాడు. తల తిప్పి చూసేడు. బోలెడుమంది అమ్మలు కనిపించారు. తల దించుకున్నాడు.



''చెప్పూ?'' ముద్ద నోట్లోనే వుంది.

''అదిగో అమ్మ'' కనిపించిన దాన్ని చూపాడు.

''ఛీ అది అమ్మ కాదు బొమ్మ'' నవ్వాడు కిలకిలా.

మేరీ మాత సాదరంగా చూస్తోంది ఇద్దరినీ.

మళ్ళీ బుజ్జిబాబుకు సందేహం వచ్చింది.

''నువ్వు అన్నం తినవా?''

''తిన్నానులే...''

''ఊహు. నువ్వు తిన్లేదు'' చిట్టి చేతుల్తో ఓ ముద్ద పెట్టబోయాడు. వద్దంటూ తల పక్కకు తిప్పుకోబోతే మూతికి అంటుకుంది అన్నం. ఏ కాస్త నాలుక్కంటిందో భలే పసందుగా వుంది. చప్పరించేడు. మరో ముద్ద నోటికి అందితే కాదనలేకపోయాడు. అలా ఇంకో ముద్ద... అంతే!

ఛెళ్ళుమంది చెంప.

''రాస్కెల్స్.. క్రీచర్స్'' ఏమిటేమిటో తిడుతుంది చదువుకున్న అమ్మ.

''వాచ్‌మాన్. ఈ అలగా వాళ్ళనెందుకు రానిస్తున్నావ్? ఏం చేస్తున్నారో చూశావా?'' హుంకరించింది.

మరుక్షణం కృష్ణమూర్తి గేటుకివతల కొచ్చిపడ్డాడు.

దుమ్ము దులుపుకున్నాడు. అమ్మ కొట్టినందుకు ఏడుపు రావడంలేదు. మళ్ళీ తననా గేట్‌లోపలికి రానివ్వరేమో! అని తల్చుకుంటే ఏడుపు వస్తోంది. రెండు రోజులపాటు గేటు కివతలగా వుండిపోయేడు. మూడో రోజు వాచ్‌మెన్ కనబడలేదు

మళ్ళీ ఆ కాన్వెంట్ స్వర్గంలోకి అడుగు పెట్టాడు. ఆ పిల్లలూ.... వాళ్ళ నవ్వులూ ఆటలు అన్నీనూ.

ఓ పాప ఏడుస్తోంది. నేల మీదపొర్లుతోంది. ఫ్యాన్సీ షాపులోని రబ్బరు బొమ్మకూ ఆ పాపకూ తేడా కనబడలేదు కృష్ణమూర్తికి. పాప బుగ్గ బూరెలా అయిపోయింది అన్నయ్య కొట్టిన దెబ్బకు దగ్గరకొచ్చి చూసాడు.

''ఎందుక్కొట్టావ్?''

అడిగినవాడు విదేశీయుడిలా వున్నట్టు గమనించి ''నీకెందుకూ'' గదమాయించే జవాబుగా.

విదేశీయుని గౌరవించే దానిలా పాపే చెప్పింది నెమ్మదిగా వెక్కుతూ. సారాంశం అర్థమైంది కృష్ణమూర్తికి. అమ్మ ఇచ్చిన రెండు లడ్డూలు అన్నయ్య లాగించేసాడు. పాప ఉక్రోషానికి అన్నం కారియర్‌లోంచి మట్టిలో కలిసింది.

''ఉండ కావాలా?'' అడిగేడు.

పాప 'అవునన్నట్లు' తలూపింది.

కృష్ణ మూర్తి బుర్రలో ఏదో మెరిసింది. పగరుస్తూ హోటల్‌కు పరుగెత్తుకెళ్ళి వచ్చేశాడు.

చేతిలో లడ్డూ!

''ఇది తిను...'' ఇచ్చి పాపను ఊరడించేడు.

జిడ్డు గుడ్డలకీ— జిలుగు యూనిఫాంకీ దోస్తీ కుదిరింది. పాప కృష్ణమూర్తిని ఆసక్తిగా చూసేది. కృష్ణమూర్తి పాప పుస్తకాలను ఆసక్తిగా చూసేవాడు.

'ట్వింకిల్... ట్వింకిల్ లిటిల్ స్టార్...

రైవ్‌ను గడగడా చెప్పేది .

'టింకుల్.. టింకుల్ లిట్లుస్ టూర్..

గొణుక్కునేవాడు తనలో.

"అంటే?" అడిగేవాడు.

తనకు తెలిసినది వివరించి చెప్పేది పాప.

"నువ్వు నీట్‌గా వుండవట నీ దగ్గర ఏం తినకూడదట" చెప్పింది పాప.

"ఎవరన్నారు?"

"అన్నయ్య"

"నీట్ అంటే?"

"..."

ఆలోచించిన కృష్ణమూర్తి బుర్రకు కొద్దిగా అర్థమైంది.

రోడ్డు పక్కన శుభ్రంగా తల కత్తిరించుకున్నాడు.

శుభ్రంగా స్నానం చేసి తల దువ్వుకున్నాడు. సరుకు మాస్టరు సొంత బట్టల సబ్బుతో రహస్యంగా వుతుక్కున్న చొక్కా చెడ్డీ వేసుకున్నాడు. తొందరగా బయలుదేరబోయాడు. చప్పున గుర్తొచ్చింది.

నెమ్మదిగా పిల్లిలా అడుగుపెట్టాడు. చేతికి చిక్కింది తీసుకుని పరిగెత్తబోయాడు దబ్‌మని పడ్డాడు. లేవబోతే మళ్ళీ దబ్... దబ్...

"ముష్టినా కొడకా... ఇదా నువ్వు చేసే పనీ? నీ ... రోజూ లెక్క తక్కువస్తుంటే ఏటో అనుకున్నా... పోరా! ముష్టి నా కొడకా...

లడ్డులా—

తల చితికింది.

చితికిన తల ఎర్రగా అయింది. చితికిన తలకు రెండోరోజున ధర్మాసుపత్రిలో దయతలచిన నర్సు కట్టు కట్టింది.

నొప్పి ... నీరసం!

* * *

ఆకలి.... మండు టెండలా ఆకలి..

రకరకాల కారియర్లు. పప్పూ అన్నం



# కారణం

డాక్టర్‌తో విచారంగా చెప్పాడు జోగినాథం

"ఎన్ని వ్రతాలు చేసినా మాకు పిల్లలు కలగటం లేదు సార్!"

"మీకు ఏమైనా సమస్యలున్నాయా?"

"లేవు"

"అదీ సంగతి! సమస్యలు లేవు కాబట్టే రాత్రుళ్ళు మీరు నిద్రపోతూ వుండుంటారు" చక్కన చెప్పాడు డాక్టర్.

—ఎం.రమణారెడ్డి (నందికొట్కూరు)

స్వీట్స్ అన్నీ... ఎన్నో

ఏ పాప... ఏ బాబు దగ్గర కెళ్ళాలో తోచలేదు.

పని చేసే హోటల్‌తో రుణం తీరిపోయింది. మళ్ళీ ఓ ముద్దకోసం యాచన. ఊరవతల పాడుబడిన గుడిలో నివాసం. నిద్ర.

రాను రానూ కృష్ణమూర్తి కడుపులో ఆకలి లేదు. అల్సర్ వుంది! ఆస్పత్రికెళ్ళాడు. తెల్ల బిళ్ళలిస్తారు. ఆకలిలా కాస్సేపు తగ్గి... మళ్ళీ మొదలవుతుంది. నొప్పి!

బాధ.. ఏడుపు... మూలుగు..

పక్కన చేరిన కుక్క పిల్లలతో కాస్సేపు ఆటలు. తల్లి కుక్క మొరుగుతుంది. పిల్లలు పాలు తాగేందుగు పరుగులు తీస్తాయి. పాలు తాగి తల్లి కడుపులో దూరి పడుకుంటాయి.

వాటికే భయమూ లేదు. ఆకలి బాధ ఆ జీవాలకు లేదు.

ముదిరిపోయిన జబ్బేదో కృష్ణమూర్తిని కదల్లేకుండా చేసింది కుక్క. కుక్కలా కూర్చుని ఎక్కడినుంచోతెస్తోంది. ఎంగిలి ఆకులు.

అందులోని అవశేషాల్ని తృప్తిగా తింటున్నాయి పిల్లలు. అదీ చూశాడు. నీరసంగా నవ్వాడు. కుక్క తల తోకా ఆడించింది. ఓ రెండాకులు అందించపోయింది.

కృష్ణమూర్తి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. తాత మెదిలాడు. తాత మాటలు పదే పదే గుర్తుకు వస్తున్నాయి.

భళ్ళున వాంతి అయింది. ఎర్రటి రక్తం వాంతి చేసుకున్నాడు. కుక్క పిల్లలు దీనంగా చూస్తున్నాయి అతడి వేపు.

కృష్ణమూర్తి కళ్ళలోంచి జీవం ఎటో ఎగిరిపోయింది.


* * *

అంతర్జాతీయ బాలల సంవత్సరం సందర్భంగా దేశాధినేత పండుగ జరిపి బాలల సంక్షేమానికి వంద కోట్ల రూపాయలు విడుదల చేశాడు.



## చంద్రునిపై ఆట

ఏ ఆటకు ఎక్కువ స్థలం అవసరం అని అడిగితే 'లాన్ టెన్నిస్' అని చాలామంది చెబుతాం. కాని అది నిజంకాదు. 'పోలో' అనే ఆటకు అన్నింటికన్నా ఎక్కువ స్థలం కావాలి. కాని ఈ ఆటలోని ఆటగాళ్ళ సంఖ్య కేవలం '4' మాత్రమే. చంద్రునిపై మానవుడు ఆడిన మొట్టమొదటి ఆట 'పోలో'.



డా. ఫణి (గోరంట్ల)